సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



శ్రీవారి క్షేత్రంలో పెళ్లిసందడి

శ్రీవారి క్షేత్రంలో శనివారం రాత్రి సుమారు 200కు పైగా వివాహాలు జరిగాయి. ఆదివారం ఉదయం సైతం క్షేత్రంలో పెళ్లిళ్లు అధికంగా జరిగాయి. 8లో



పశుగ్రాసం కొరత పరిష్కారం

ప్రతికూల వాతావరణంతో పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. పశుగ్రాసం కొరత పరిష్కారానికి పశువైద్యాధికారులు పలు సూచనలు చేశారు. 8లో



స్కూళ్లలోనే బడి ఈడు పిల్లలు

బడి ఈడు పిల్లల్ని తిరిగి స్కూళ్లు, కళాశాలల్లో చేర్పించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో 14,290 మందిని తిరిగి బడిలో చేరేలా చర్యలు చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

చంద్రయాన్‌–3 ఇంజినీర్‌కు అభినందనలు



పాలకొల్లు మండలం దగ్గులూరులో చంద్రయాన్‌–3 ఇంజినీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌

పాలకొల్లు అర్బన్‌ : చంద్రయాన్‌–3 ప్రాజెక్టులో పనిచేయడం ద్వారా పాలకొల్లు ప్రాంతానికి శ్రీనివాసరావు ఎంతో కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ అన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో చంద్రయాన్‌–3 ఇంజినీర్‌ శిద్ధాని శ్రీనివాసరావును ఆదివారం శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ నాయకులు విశ్వనాథం పేరయ్య, సప్పరపు కోటేశ్వరావు, శిద్ధాని కోటి మల్లేశ్వరరావు, సప్పరపు ప్రసాద్‌ తదితరులున్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక



ప్రధానోపాధ్యాయుల సంఘానికి నూతనంగా ఎన్నికైన నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘ నూతన అధ్యక్షుడిగా నెల్లూరు జిల్లాకు చెందిన పీ వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా ఏలూరు జిల్లాకు చెందిన వీ శ్రీనివాసరావు, కోశాధికారిగా కాకినాడ జిల్లాకు చెందిన సీవీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన జయరామిరెడ్డి, ఏవీహెచ్‌ శాస్త్రి ప్రకటించారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా జీవీ నారాయణ రెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ పలు తీర్మానాలు చేసింది.

చిన్నారిని చిదిమేసిన మద్యం మత్తు



చిన్నారి మృతదేహం వద్ద బోరున విలపిస్తోన్న తల్లి

ఏలూరు టౌన్‌: ఏలూరు పాతబస్టాండ్‌ ఫ్లైఓవర్‌ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతిచెందింది. మద్యం సేవించి మోటారు సైకిల్‌పై వేగంగా వెళ్తూ ఆటోను ఢీకొట్టగా.. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చిన్నారి తీవ్ర గాయాలతో మృతిచెందింది. ఏలూరు టూటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముసునూరు మండలం రంగంపేట గ్రామానికి చెందిన జక్కుల కుమారి, తన కుమార్తె ఐశ్వర్య (10)ను తీసుకుని దెందులూరు మండలం గాలాయగూడెంలోని హాస్టల్‌లో చదువుతున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అనంతరం ఏలూరు పాతబస్టాండ్‌ ఆటోస్టాండ్‌లోని ఆటోలో ఏలూరు నగరంలోకి వస్తుండగా ఫ్లైఓవర్‌ బ్రిడ్జిపై ఆటో, మోటారు సైకిల్‌ ఢీకొన్నాయి. బైక్‌పై మద్యం మత్తులో వస్తున్న ఇద్దరు యువకులు వేగంగా ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐశ్వర్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. భర్త ఇటీవల మరణించడం, కుమార్తె రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లి కుమారి కన్నీరు మున్నీరుగా విలపించింది. మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న కుమ్మరిరేవు ప్రాంతానికి బోనువాసు, నాగసాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హాస్పిటల్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ప్లాట్‌ బుకింగ్‌కు 30 వరకు గడువు పెంపు

నూజివీడు: సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నూజివీడులోని విస్సన్నపేట రోడ్డులో మామిడి పరిశోధనస్థానం పక్కన ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్‌ టౌన్‌షిప్‌లో ప్లాట్‌ బుకింగ్‌కు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్‌ వివేక్‌ యాదవ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ 40.78 ఎకరాల్లో 393 ప్లాట్‌లతో లేఅవుట్‌ వేశామని, ఇందులో 150, 200, 240 గజాల వైశ్యాలంతో ప్లాట్‌లు అందుబాటులోకి తెచ్చామన్నారు. గజం ధర రూ.8500కు అందిస్తూ సులభమైన వాయిదాల పద్ధతిని కూడా అనుకూలంగా రూపొందించామన్నారు.

వర్జీనియా.. అధరహో !

- కేజీకి రికార్డు స్థాయిలో రూ.288 ధర
- 5 వేలం కేంద్రాల్లో రూ.1422.53 కోట్ల పొగాకు అమ్మకాలు



జంగారెడ్డిగూడెం : ఐదు వేలం కేంద్రాల్లో 2022–23 సీజన్‌లో వర్జీనియా వేలం ప్రక్రియ వర్జీనియా ధరల మునుపెన్నడూ లేని నూతన రికార్డులను సృష్టిస్తూ దూసుకుపోయాయి. 2022–23 సీజన్‌ రైతులకు నూతనోత్తేజాన్ని కల్పించింది. సీజన్‌ మొత్తం అ'ధ'రహో అనిపించేలా వేలం ప్రక్రియ కొనసాగింది. నెమ్మదిగా ప్రారంభమైన వేలం ప్రక్రియను చూసి ఒక దశలో రైతులు సరాసరి రూ. 200 దాటితే చాలు అనుకున్నారు. వారి అంచనాలను తారుమారు చేస్తూ నూతన రికార్డుల నమోదు చేస్తూ వేలం కొనసాగింది. గత ఏడాది గరిష్ట ధర రూ. 245 దాటి రోజుకో రికార్డును నమోదు చేస్తూ చివరకు గరిష్ట ధర రూ. 288 చేరుకుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో వేలం ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు వేలం కేంద్రాల్లో మొత్తంగా రైతులు 55 మిలియన్‌ కిలోల పొగాకును అమ్ముకున్నారు. రూ.1422.53 కోట్ల విలువైన పొగాకును వేలం ప్రక్రియలో అమ్మారు.

సరాసరిలోను అదే తీరు

గత సీజన్‌ వరకు వర్జీనియా వేలం ప్రక్రియలో గ్రేడ్‌–1 పొగాకుకు అత్యధిక ధర లభించగా, మిగిలిన గ్రేడ్‌లకు ఆశించిన స్థాయిలో ధరలు వచ్చేవి కావు. దీంతో రైతులకు నష్టం ఎదురయ్యేది. ఈ సీజన్‌లో గరిష్ట ధరలు ఒకే స్థాయిలో కొనసాగుతూ పైపైకి ఎగిసిపడుతూ వేలం ముందుకు సాగింది. గత ఏడాది సరాసరి రూ. 191.72 మాత్రమే లభించింది. ఈ ఏడాది ఎస్‌ఎల్‌ఎస్‌ పరిధిలో సరాసరి ధర కేజీ ఒక్కంటికి రూ. 248 లభించింది. గత ఏడాది తో పోల్చితే ఈ ఏడాది సరాసరి ధర రూ. 56.28 అధికంగా లభించింది.

రైతుల్లో ఆనందం

గత ఏడాది వరకు రైతులకు వేలం ప్రక్రియ ఆశించినంతగా సాగలేదు. దీనికి తోడు ఈ ఏడాది సైతం తొలి దశలో పంటలు దెబ్బతినడంతో రైతులు కుదేలయ్యారు. అయినప్పటికి నాణ్యమైన వర్జీనియా పొగాకును పండించే లక్ష్యంతో రైతులు ముందుకు సాగారు. నాణ్యమైన పంట వేలానికి తీసుకువచ్చారు. ప్రారంభంలో అంతంతమాత్రంగా ఉన్న వర్జీనియా ధర క్రమంగా పెరిగి రూ.288 చేరుకోవడం, సరాసరి రూ. 50 అదనంగా లభించింది. దీంతో గత సీజన్‌ వరకు నష్టాలతో ఉన్న సన్న, చిన్నకారు రైతులు గట్టెక్కారు. వారి మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మంచి ధర లభించడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు.

దేశీయ పొగాకుకు డిమాండ్‌

అంతర్జాతీయ మార్కెట్‌లో దేశీయ పొగాకుకు మంచి డిమాండ్‌ లభించింది. కరోనా సమయంలో అంతర్జాతీయంగా పొగాకు పంటకు ఆంక్షలు విధించడంతో రైతులు అక్కడ పంట పండించడం తగ్గించారు. రెండు, మూడేళ్లకు సరిపడా ఉంచిన నిల్వలు నిండుకున్నాయి. జింబాబ్వే, బ్రెజిల్‌, చైనా దేశాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. దేశీయంగా మాత్రం కరోనా సమయంలో కూడా పొగాకు పండించి రైతులు అమ్ముకున్నారు. ఈ సీజన్‌కు దేశీయంగా వర్జీనియా పంట బాగా పండింది. దీంతో అంతర్జాతీయ ఎగుమతులకు డిమాండ్‌ పెరిగింది. ఆయా కంపెనీలకు ఎగుమతులు ఆర్డర్‌లు రావడంతో పోటీపడి మరీ పొగాకును కొనుగోలు చేశారు. రానున్న సీజన్‌లో వర్జీనియా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఏటా ఈ ధరలు లభిస్తాయని ఊహించలేం. ఈ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు భూముల కౌలు, బ్యారన్‌ లీజ్‌లు పెంచుకోవడం సమర్థనీయం కాదని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, రీజనల్‌ మేనేజర్‌ ఆదిశేషయ్య హెచ్చరిస్తున్నారు.

వేలం కేంద్రం	అమ్మకాలు (మి.కిలోలు)	విలువ (రూ. కోట్లలో)	గరిష్టం (రూ.)	కనిష్టం (రూ.)	సరాసరి (రూ.)
దేవరపల్లి	9.70	232.06	287.00	150.00	239.18
జంగారెడ్డిగూడెం–1	12.73	313.58	287.00	170.00	246.36
జంగారెడ్డిగూడెం–2	11.94	295.86	288.00	160.00	248.41
కొయ్యలగూడెం	12.93	317.76	287.00	170.00	245.79
గోపాలపురం	10.60	263.27	286.00	165.00	248.31

రెట్టించిన ఉత్సాహంతో..



ఈ ఏడాది మంచి ధర లభించడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. గరిష్ట ధర కూడా మంచిగానే లభించింది. సరాసరి ధర కూడా గత ఏడాది కన్నా రూ. 50 అధికంగా అభించింది. దీంతో రైతులు రానున్న సీజన్‌కు రెట్టించిన ఉత్సాహంతో పొగాకును సాగుచేసేందుకు సమాయాత్తం అవుతున్నారు. రానున్న సీజన్‌ కూడా ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నాం.

– ఘంటశాల గాంధీ, వర్జీనియా రైతు నాయకుడు

20 శాతం పంట పెరిగే అవకాశం



2022–23 సీజన్‌ ఆశించిన స్థాయిలో జరిగింది. అన్ని కంపెనీలకు మంచి ఆర్డర్లు రావడంతో, రైతుకు మంచి మార్కెట్‌ లభించింది. ఈ సీజన్‌ ఇచ్చిన ఉత్సాహంతో రానున్న సీజన్‌లో 20 శాతం వరకూ పంట పెరిగే అవకాశం ఉంది. అలాగే ఉత్పత్తి వ్యయం పెరిగే అవకాశం ఉంది. కంపెనీలు మంచి ఆర్డర్స్‌ తీసుకువచ్చి రైతులకు మంచి ధర ఇవ్వాలి.

– సత్రం వెంకట్రావు, వర్జీనియా రైతు నాయకుడు

ఉత్తమ అధ్యాపకుల అవార్డులకు ఎంపిక



డాక్టర్‌ అల్లూరి వెంకట నాగవర్మ



డాక్టర్‌ బి.జ్యోతి

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు డీఎన్నార్‌ కళాశాల నుంచి ఇద్దరు అధ్యాపకులు ఎంపికయ్యారు. డీఎన్నార్‌ కళాశాలలో పీజీ ఎకనామిక్స్‌ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్‌ అల్లూరి వెంకట నాగవర్మ, మ్యాథ్స్‌ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్‌ బి.జ్యోతిలకు అవార్డు లభించింది. ఇద్దరు అధ్యాపకులు ఈనెల 5న విశాఖపట్నంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. అవార్డులకు ఎంపికైన అధ్యాపకులకు డీఎన్నార్‌ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), పాలకవర్గం, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

శ్రీనివాసరావుకు బెస్ట్‌ లెక్చరర్‌ అవార్డు



తాడేపల్లిగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న సీహెచ్‌ శ్రీనివాసరావు 2022–23 సంవత్సరానికి స్టేట్‌ బెస్ట్‌ లెక్చరర్‌ అవార్డుకు జిల్లా నుంచి ఎంపికయ్యారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈఏపీసెట్‌, నీట్‌ వంటి పరీక్షల్లో శిక్షణ ఇవ్వడం, మెరిట్‌ సాధించిన విద్యార్థులకు బహుమతులిచ్చి ప్రోత్సహించడం, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

బాడీ బిల్డర్స్‌ అసోసియేషన్‌ కార్యవర్గం ఎన్నిక



భీమవరంలో నూతనంగా ఎన్నికైన బాడీ బిల్డర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు

సాక్షి, భీమవరం: జిల్లా బాడీ బిల్డర్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కటారి రవిశంకర్‌, షేక్‌ ఖాసిమ్‌ ఎన్నికయ్యారు. అసోసియేషన్‌ గౌరవాధ్యక్షుడిగా డి.జానీ, సంయుక్త కార్యదర్శిగా వలవల ఫణి, భీమవరం పట్టణ బాడీ బిల్డర్‌ అసోసియేషన్‌ గౌరవాధ్యక్షుడిగా ఆనంద వర్మ, అధ్యక్షుడిగా డీఎస్‌ రాజు, కార్యదర్శిగా గోవర్ధన్‌, సంయుక్త కార్యదర్శిగా కోడే రాజును ఎన్నుకున్నారు. అనంతరం కటారి రవిశంకర్‌, షేక్‌ ఖాసిమ్‌ మాట్లాడుతూ నూతన కమిటీ సహకారంతో రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్‌ పోటీలు నిర్వహించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తామన్నారు. అనంతరం రాజీవ్‌ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు గ్రహీత పాలకోడేరు మండలం విస్సాకోడేరు సర్పంచ్‌ బొల్లా శ్రీనివాస్‌, గోవాలో డాక్టరేట్‌ సేవా పురస్కారం అందుకున్న డీఎస్‌ రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్‌, మద్దు వాసు, దాసి ప్రసాద్‌, రవి రాజా, ఆకుల సతీష్‌, నాగు, పి.వెంకటేశ్వరరావు, కొక్కిరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో చేతివృత్తిదారులకు ప్రయోజనం

భీమవరం (ప్రకాశంచౌక్‌): పీఎం విశ్వకర్మ యోజన పథకంతో 18 రకాల చేతివృత్తులవారు ప్రయోజనం పొందాలని కలెక్టర్‌ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పని చేసేవారు, బుట్ట/చాప/చీపుర్లు చేసేవారు, బొమ్మల తయారీదారులు, సంప్రదాయ బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీదారులు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం కింద 5 నుంచి 7 రోజులపాటు శిక్షణ ఇస్తారని, ఆసక్తి ఉన్నవారికి 15 రోజుల శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్‌ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం రూ.15 వేల విలువైన టూల్‌ కిట్‌ను అందిస్తారని తెలిపారు. తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తారని తెలిపారు. సెప్టెంబర్‌ 17న పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రధాని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. పథకం ప్రారంభం నాటికి రిజిస్ట్రేషన్‌, ఎంపిక పూర్తి చేయాలన్నారు.

సంక్షేమంతో జీడీపీలో ఏపీ టాప్‌

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తేతలిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్‌: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో జీడీపీ వృద్ధిలో మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం సాయంత్రం తణుకు రూరల్‌ మండలం తేతలి గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ చంద్రబాబు అమరావతి కాంట్రాక్ట్‌ ద్వారా రూ.108 కోట్లు తన బ్యాంక్‌ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారని, దీని కోసమే ఐటీ శాఖ నోటీసులు పంపించిందని చెప్పారు. చంద్రబాబు అమరావతి అవినీతికి సంబంధించి ఇది చిన్న మొత్తమేనని, త్వరలో మరిన్ని అవినీతి భాగోతాలు బయటకు వస్తాయని చెప్పారు. కరోనా సమయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అందించిన సేవలు అమోఘమని, అలాంటి వారిని వద్దని చెప్పడం ప్రతిపక్షాలకు మానవత్వం లేదన్నారు. రాష్ట్రంలో నాడు–నేడు పథకం ద్వారా రూ.67 వేల కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేసి వాటిలో మౌళిక సదుపాయాలను కల్పించామన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, డిజిటల్‌ క్లాస్‌ రూంలు, యూనిఫాం, గోరుముద్ద పథకం ద్వారా పోషకాహారం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడిగా మారిపోయారని, ప్రతి కుటుంబంలోనూ ఒకటి కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు పొందుతున్నారని చెప్పారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కోట నాగేశ్వరరావు

తేతలి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా గ్రామ మాజీ సర్పంచ్‌ కోట నాగేశ్వరరావును నియమిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. గ్రామానికి సంబంధించి ఏ పనులైనా ఆయన చేస్తారని చెప్పారు. పలువురు నాయకులు, కార్యకర్తలు కోట నాగేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మైనారిటీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ మెహర్‌ అన్సారీ, మాజీ ఏఎంసీ చైర్మన్‌ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైస్‌ ఎంపీపీ గారపాటి పద్మజ, నాయకులు ముళ్లపూడి బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు పేరిచర్ల సతీష్‌ రాజు, మాజీ అధ్యక్షుడు సరెళ్ల అర్జియ్య, భూపతిరాజు రామకృష్ణంరాజు, కోట స్వామీజీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్‌, వైఎస్సార్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులే

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజానికి దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని, విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంపీ కోటగిరి శ్రీధర్‌ తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక గ్రీన్‌ సిటీలోని లయన్స్‌ క్లబ్‌ భవనంలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోటగిరి శ్రీధర్‌ మాట్లాడుతూ విద్యాబోధనలో ఉపాధ్యాయులు ప్రమాణాలు పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణల మేరకు బోధన కొనసాగించాలని కోరారు.

పరిశ్రమల విద్యుత్‌ వినియోగంపై నియంత్రణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెలలో విద్యుత్‌ లభ్యత తక్కువగా ఉన్నందున, పెరుగుతున్న గ్రిడ్‌ డిమాండ్‌ కారణంగా ఈ నెల 5 నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లాలో పరిశ్రమల విద్యుత్‌ వినియోగంపై నియంత్రణ విధిస్తున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్‌ సర్కిల్‌ సూపరింటెండింగ్‌ ఇంజనీర్‌ పీ.సాల్మన్‌ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వ్యవసాయ విద్యుత్‌ వినియోగదారులకు విద్యుత్‌ అంతరాయం ఉండదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేయాలంటే ఈ నియంత్రణ తప్పనిసరి చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. జిల్లాలో నిరంతరంగా నడిచే పరిశ్రమలు తమకు నిర్దేశించిన లోడులో రోజుకు 30 శాతం తగ్గించుకుని వినియోగించాలని సూచించారు. నిరంతరం కాని పరిశ్రమలు ప్రతి రోజూ పగటి పూట ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మొత్తం 8 గంటలు ఒకేషిఫ్టులో విద్యుత్‌ వాడుకోవచ్చని, సాయంత్రం 6 తరువాత విద్యుత్‌ను వినియోగించరాదని సూచించారు. ఇలాంటి పరిశ్రమలు వారంలో ఒక రోజును విద్యుత్‌ సెలవుదినంగా పాటించాలని సూచించారు. బల్క్‌ డ్రగ్స్‌ పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్‌ పరిశ్రమలు, వైద్యం కోసం ఆక్సిజన్‌ సరఫరా చేసే పరిశ్రమలు, రైస్‌ మిల్లింగ్‌ యూనిట్లకు ఈ నియంత్రణ చర్యల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ప్రకటించారు. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకూ అమలులో ఉంటాయన్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

- గత వారం రోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఉక్కపోతకు విలవిల్లాడుతున్న జనం
- ఆక్వాకు ముప్పని ఆందోళన చెందుతున్న రొయ్యల రైతులు





ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా భీమవరం బైపాస్‌ రోడ్డు, చెరువుల్లో తిప్పుతున్న ఏరియేటర్లు

భీమవరం(ప్రకాశం చౌక్‌): గత వారం రోజులుగా కాస్తున్న ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఎండతోపాటు, విపరీతమైన ఉక్కపోతకు జనం విలావిల్లాడుతున్నారు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత ప్రారంభమై క్రమేపి పెరిగి మధ్యాహ్నం నాటికి 40 డిగ్రీలు దాటుతుంది. దాంతో బయటకు వెళ్లీ వచ్చేవారు, ఎండలో పని చేసేవారు, ప్రయాణం చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి కూడా ఉక్కపోతలు ఉండడంతో వృద్ధులు, పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండ తీవ్రత, ఉక్కపోతతో విద్యుత్‌ వినియోగం బాగా పెరిగింది.

ఆక్వాకు ముప్పుగా వాతావరణం

ఎండలు, ఉక్కపోతలు ఆక్వాకు ముప్పుగా మారాయి. ఉక్కపోతల కారణంగా ఆక్సిజన్‌ లోపం ఏర్పడడంతో పాటు.. వైరస్‌లు సోకి రొయ్యలు చనిపోతున్నాయి. దాంతో కౌంట్‌ తక్కువగా ఉన్న తప్పని పరిస్థితుల్లో పట్టుబడులు చేస్తున్నారు. ఎకరాకు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉండడం రొయ్యకు మంచిది కాదు. రొయ్యల ధరలు బాగున్నా.. ఉక్కపోతలు, మబ్బుల కారణంగా ఆక్వా రైతులకు నష్టం ఏర్పడుతోంది. రొయ్యలకు ఆక్సిజన్‌ లోపం రాకుండా చెరువుల్లో నిర్విరామంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు. దాంతో విద్యుత్‌ వినియోగం గత రెండు మూడు నెలలతో పొల్చుకుంటే ఆగస్టులో 50 శాతం పెరిగింది. దాంతో విద్యుత్‌ ఖర్చు పెరిగింది. జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు.

వర్షాల కోసం ఎదురుచూపులు

జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌ ప్రస్తుతం పొట్ట, పాలుపోసుకోవడం తదితర దశల్లో ఉంది. సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ పై పాటుగా పడే వర్షంతో వరికి ఏంతో మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. ఇదే వాతవరణం ఎక్కువ రోజులుంటే తెగుళ్లు వస్తాయని, ఎదుగుదల లోపిస్తుందని రైతులు అంటున్నారు.

రొయ్యకు ప్రమాదం



ఉక్కపోత, మధ్యలో మబ్బుల వాతావరణం రొయ్యలకు ప్రమాదం. వైరస్‌లు సోకుతున్నాయి. భయపడి తక్కువ కౌంట్‌కే పట్టుబడి చేస్తున్నాం. ఈ వాతావరణం నుంచి రొయ్య తట్టుకోవడానికి నిరంతరం ఏరియేటర్లు తిప్పుతున్నాం.

– వీరవల్లి శ్రీనివాస్‌, ఆక్వా రైతు, వీరవాసరం

వర్షం పడితే మేలు



ఈ వాతావరణం వల్ల వరికి తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. సాగు నీరు అందుతున్నా.. వర్షాలు పడితే చేలుకు మేలు జరుగుతుంది. ఇదే వాతావరణం ఉంటే తెగుళ్ల వ్యాపిస్తాయి.

– కొమటి రాంబాబు, వరి రైతు, తాడేరు

క్లుప్తంగా

మసాజ్ సెంటర్ ముసుగులో..


నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలో మసాజ్ సెంటర్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్న 8 మందిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం జేపీ రోడ్డులోని ఒక భవనంలో సెలూన్, స్టూడియో మహిళలకు మాత్రమే అంటూ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌పై సీఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించగా ఆ సమయంలో 8 మంది పట్టుబడ్డారు. వీరిలో ఇద్దరు మహిళా నిర్వాహకులు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు, విజయవాడ, ఏలూరుకు చెందిన ఒకొక్క యువతి ఉండగా, ఒక విటుడు, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

యలమంచిలి: చించినాడ గ్రామానికి చెందిన నల్లి సత్యనారాయణ (56) రోడ్డుపై పడి చనిపోయి ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్ నాగప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం సత్యనారాయణ చించినాడ అమరవీరుల జెండా స్థూపం వద్ద రోడ్డుపై పడి చనిపోయి ఉన్నాడు. ఆదివారం ఉదయం మృతుణ్ణి గుర్తించిన స్థానికులు బంధువులకు, వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో హేమభద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మృతుని భార్య గల్ఫ్‌లో ఉండగా ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇక స్కూళ్లల్లోనే బడి ఈడు పిల్లలు

- ఈ నెల 7 వరకు మిషన్ విజన్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్
- 18 ఏళ్ల లోపు వారిని చదువుకు చేరువ చేసే ప్రణాళిక
- వరుసగా నాలుగేళ్లుగా రాష్ట్రంలో జీఈఆర్ పెరుగుదల
- నూరుశాతం జీఈఆర్ దిశగా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- ఉమ్మడి జిల్లాలో 14,290 మంది తిరిగి బడి వైపు అడుగు

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతోపాటు అమలు చేస్తున్న పథకాలతో గత నాలుగేళ్లుగా స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) క్రమంగా పెరుగుతోంది. రాష్ట్రంలో ఈ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) నూరు శాతం సాధించే దిశగా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. సెప్టెంబర్ 7వ తేదీ లోగా నూరుశాతం స్థూల నమోదు నిష్పత్తి ఉండేలా తగిన చర్యలు తీసుకుంటోంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులందరినీ సమన్వయం చేస్తూ మిషన్ విజన్ పేరుతో ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా దశల వారీగా వడపోత చేసి ఉమ్మడి జిల్లాలో బడి బయట ఉన్నట్లు గుర్తించిన 14,290 మంది బడి ఈడు పిల్లలను తిరిగి పాఠశాలల్లో, కళాశాలల్లో, ఓపెన్ స్కూళ్లలో చేర్పించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది.

నిడమర్రు: స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) అనేది విద్యారంగంలో ఉపయోగించే చదువుకునే వారి గణాంక కొలత. మిషన్ విజన్‌లో భాగంగా ఈనెల నాలుగో తేదీ లోపు 5 నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న వారంతా బడిలో చేర్పిస్తే నూరుశాతం జీఈఆర్ సాధించినట్లు. దీనికోసం ప్రభుత్వం గ్రామ/వార్డు వలంటీర్ల సహకారంతో వారి పరిధిలో సెప్టెంబర్ 2005 నుంచి ఆగస్టు 2018 మధ్య జన్మించిన వారందరి వివరాలు సేకరించి వారిలో మధ్యలో చదువుకు దూరమైన వారిని లెక్కతేల్చి, బడి/కళాశాల మానేసిన వారందరినీ తిరిగి బడికి చేరువ చేసే బృహత్తర కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.

యజ్ఞంలా కార్యక్రమం

ఉమ్మడి జిల్లాలో 5 నుంచి 18 ఏళ్ల మధ్యలో బడి మానేసిన వారందరిని తిరిగి చదువులు కొనసాగించే కార్యక్రమం యజ్ఞంలా కొనసాగుతోంది. గ్రామ, వార్డు వలంటీర్ల సహకారంతో ఆధార్ డేటా ఆధారంగా బడి మానేసిన వారిని ఉమ్మడి జిల్లాలో 33వేల మంది ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయులు, వలంటీర్లు, సీఆర్పీల సహకారంతో 18 ఏళ్లు నిండినవారిని, డబుల్ ఎంట్రీ, చనిపోయినవారిని, ఇతర రాష్ట్రాలు ఉన్నవారిని వడపోత చేయగా 14,290 మంది ఉన్నట్లు తేల్చారు. వీరందరిలో పాఠశాల స్థాయిలో ఉంటే ఆయా పాఠశాలల్లో మిగిలిన 10,020 మందిని ఓపెన్ స్కూళ్లలో చేర్చేలా ప్రణాళికలు రూపొందించి నమోదు చేసే కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది.


పిప్పర హైస్కూల్లో విద్యార్థిని టెన్త్‌లో రీఅడ్మిషన్ చేయిస్తున్న ఎంఈవో బాలయ్య

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజులు ప్రభుత్వమే భరించేలా..

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా టెన్త్, ఇంటర్ నమోదు చేసుకునే వారి ఫీజులు ప్రభుత్వమే భరించేలా సమగ్ర శిక్ష అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ చెప్పారు. దీని కోసం సచివాలయ వెల్ఫేర్ సహాయకుల ద్వారా 16–19 ఏళ్ల వయసు ఉండి టెన్త్, ఇంటర్ మానేసిన పిల్లల వివరాలు శనివారం సేకరించారు. ఓపెన్ స్కూల్లో చదివే విద్యార్థుల అడ్మిషన్ ఫీజులు సర్వశిక్ష నిధుల నుంచి చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. 16 లోపు, 19 పైబడిన వయసు కలిగిన విద్యార్థుల ఫీజులు ఎవరికి వారే చెల్లించుకోవాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు.

గత నాలుగేళ్లుగా పెరుగుతున్న జీఈఆర్

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి విద్యారంగంలో జరుగుతున్న సంస్కరణల కారణంగా ఏపీలో గత నాలుగేళ్లుగా జీఈఆర్ పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రాథమిక విద్యలో 2018లో జాతీయ స్థాయిలో జీఈఆర్ 96.09 ఉండగా రాష్ట్రంలో 92.91 ఉంది. అలాగే 2019–20 నుంచి వరుసగా ప్రాథమిక విద్యలో జీఈఆర్ పెరగుతూ 2022–23 నాటికి జాతీయ స్థాయిని మించి 100.80కి చేరింది. (18 ఏళ్లు నిండి చదువుతున్న వారి సంఖ్యను జీఈఆర్ గణాంకాల్లో ఉంటారు). అలాగే సెకండరీ విద్యలో 2019లో జీఈఆర్ 79.69 ఉండగా 2022–23నాటికి 89.63కు చేరింది. ఉన్నత విద్యలో 2018–19లో జీఈఆర్ 46.88 ఉండగా 2022–23 నాటికి 69.87 శాతానికి పెరిగింది.


ఏలూరు రూరల్‌లో చెత్త ఏరుకుంటూ చదువుకు దూరమైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఈవో శ్యామ్‌సుందర్

ఉమ్మడి జిల్లాలో చదువుకు దూరమైన వారి వివరాలు

టెన్త్‌లోపు చదువు మానేసినవారు	4,039
టెన్త్ ఫెయిల్‌తో మానేసినవారు	4,619
టెన్త్ పాసై మానేసినవారు	3,810
ఐటీఐ మధ్యలో మానేసినవారు	41
నర్సింగ్ మధ్యలో మానేసినవారు	07
ఏ పాఠశాలలోనూ చేరనివారు	21
సంపాదన అవసరాల నిమిత్తం..	198
ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు	267
దివ్యాంగులుగా ఉన్నవారు	272
చదువు ఇష్టంలేని వారు	1,016
మొత్తం బడిబయట ఉన్నవారు	14,290

తొలి రాష్ట్రంగా ఏపీ



దేశంలో విద్యార్థుల నమోదులో నూరుశాతం స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) సాధించిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలవాలనే లక్ష్యంతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కృషి చేస్తున్నారు. ఆ దిశగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో బడి ఈడు పిల్లలంతా తిరిగి బడులకు చేర్చే కార్యక్రమం యజ్ఞంలా సాగుతోంది. ఈ లక్ష్య సాధనలో బడికి దూరమైన విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరుతున్నాం.

– పి.శ్యామ్‌సుందర్, డీఈవో, ఏలూరు

మెరుగైన స్థాయిలో ఉంచేందుకే



సీఎం వైఎస్ జగన్ విద్యా విధానంలో చేపట్టే విప్లవాత్మక మార్పులు యువతను మెరుగైన స్థాయిలో ఉంచుతాయి. టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలై చదువులు మానేసినవారు, పదో తరగతి, ఇంటర్ ఫెయిలైనా తిరిగి రెగ్యులర్ తరగతుల్లో చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. వీరికి అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్ద, విద్యా, వసతి దీవెన పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటోంది.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

సమగ్ర శిక్ష ద్వారా ఫీజుల చెల్లింపు



16 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న వారు ఓపెన్ స్కూల్లో జాయిన్ అయితే అడ్మిషన్ ఫీజుతోపాటు ఇతర ఫీజులను ప్రభుత్వమే సమగ్ర శిక్ష ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటోంది. బడి ఈడు పిల్లల సర్వే గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థతో సులభంగా సాధ్యమైంది. తక్కువ సమయంలో నూరుశాతం జీఈఆర్ సాధించడానికి గ్రామ సచివాలయ వ్యవస్థ చాలా కీలకంగా మారింది. అమ్మ ఒడి పథకంతో ప్రాథమిక విద్యలో జీఈఆర్ జాతీయ స్థాయిని మించి ఏపీ సాధించగలిగింది.

– సబ్బిత నర్సింహమూర్తి, ఎంఈవో, దెందులూరు

బ్రాహ్మణులు రాజకీయంగా చైతన్యవంతం కావాలి

తాడేపల్లిగూడెం రూరల్: బ్రాహ్మణులు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని రాష్ట్ర శాసనసభ మాజీ ఉప సభాపతి కోనా రఘుపతి పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిగూడెం మండలంలోని పెదతాడేపల్లి గాయత్రీ బ్రాహ్మణ కళ్యాణమండపం ఆవరణలో సూర్యనారాయణమూర్తి ఆలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం ప్రకటించారు. ప్రతిఒక్కరూ తమ స్థోమతకు తగ్గట్టుగా ఆలయ నిర్మాణానికి సహకరించాలని రఘుపతి కోరారు. రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ యనమంత్ర సాయిసురేష్, టీటీడీ ధార్మిక పరిషత్ మెంబర్ పేర్లి కామేశ్వరరావు, డీజీపీ కార్యాలయ ఓఎస్‌డీ పీవీఎస్.రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీ, నరిశే సోమేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్, బ్రాహ్మణ సేవా పరిషత్ కార్యదర్శి బుద్ధవరపు సత్య వెంకట సుబ్బారావు, కోశాధికారి ప్రవా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సూర్యనారాయణమూర్తి ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న కోనా రఘుపతి

ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్

- శ్రీహర్షిత ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ అరెస్ట్
- స్కూల్ మూతపడితే పరిస్థితి ఏంటని తల్లిదండ్రుల ఆందోళన


పాఠశాల సమీపంలో బాధితుల ఆందోళన (ఫైల్)

కామవరపుకోట: ఓ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ అరెస్ట్‌తో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పిల్లల పరిస్థితిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. కామవరపుకోట మండలం తడికలపూడి శ్రీ హర్షిత ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నందిగామ రాణి, ఆమె భర్త ధర్మరాజు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో పలు ఎన్నారైలు, వ్యాపారస్తులు, మరికొందరి నుంచి పాఠశాల లాభాల్లో వాటా ఇస్తానని నమ్మించి వారి దగ్గర నుంచి సుమారు రూ.30 కోట్లు అప్పుగా తీసుకున్నారు. నాలుగు ఎకరాల స్థలంలో తడికలపూడి నుంచి కళ్ళచెరువు రోడ్‌లో నూతనంగా హాస్టల్‌తో కూడిన పాఠశాల భవనాలను, జూనియర్ కాలేజీ భవనాలను నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసి నూతన భవనాల్లో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు చేపట్టారు. ఆ తర్వాత అప్పు ఇచ్చిన వారికి, పాఠశాల లాభాల్లో వాటా ఇస్తానన్న వారికి మొహం చాటేశారు. అప్పు చెల్లించమని అడిగిన వారిని చంపుతానని బెదిరించారు. దీంతో ఆంధ్ర, తెలంగాణ నుంచి ఒకొక్కరుగా బయటకు రావడంతో అసలే మొదట నుంచి దురుసు ప్రవర్తన కలిగిన కరస్పాండెంట్ నందిగామ రాణి ఆమె నిజ స్వరూపం, ఆమె చేసిన మోసాలు ఒకొక్కటిగా బయటపడ్డాయి. మోసపోయామని గ్రహించిన బాధితులు గత ఆరు నెలల నుంచి ఆమెపై ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో పలు కేసులు పెట్టడంతో పాటు బాధితులు పాఠశాల సమీపంలో ఆందోళనలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ కేసుల వలన పాఠశాల మూతపడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని పాఠశాలలో చదివే కొంతమంది పిల్లలను వారి తల్లిదండ్రులు వేరొక స్కూల్లోకి చేర్పించారు. గత శనివారం పాఠశాల కరస్పాండెంట్ నందిగామ రాణిని, ఆమె భర్త ధర్మరాజును తెలంగాణ రాష్ట్రంలో అరెస్టు చేసి జైలుకు పంపించడంతో విద్యా సంవత్సరం మధ్యలో స్కూలు మూతపడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు మరింత ఆందోళన చెందుతున్నారు.

వలంటీర్ల సేవా దృక్పథం


హైదరాబాద్‌లో ఎలమటి రామలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అప్పారావు


ఏలూరు ఆస్పత్రిలో బాలరాజుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీ శ్రీదేవి

వీరవాసరం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారులకు ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేసి సేవాదృక్పథం చాటుకుంటున్నారు వలంటీర్లు. నవుడూరు గ్రామానికి చెందిన ఎలమటి రామలక్ష్మి హైదరాబాదులోని బసవ తారకం ఇండో అమెరికన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు వచ్చిన వితంతు పింఛన్‌ను గ్రామానికి చెందిన వలంటీర్ అప్పారావు హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు వలంటీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన గుడివాడ బాలరాజు అనారోగ్యంతో ఏలూరులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామ వలంటీర్ కూరాకుల లక్ష్మీ శ్రీదేవి ఏలూరు వెళ్లి బాలరాజుకి పింఛన్ నగదును అందజేసింది. వలంటీర్ లక్ష్మీ శ్రీదేవిని సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీపీ కొదమ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ తదితరులు అభినందించారు.

శ్రీవారి క్షేత్రంలో పెళ్లిసందడి


పెళ్లిజనాలతో రద్దీగా తూర్పు రాజగోపుర ప్రాంతం


శ్రీవారి దర్శనానంతరం బయటకు వెళుతున్న కొత్త జంట

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం పెళ్లి బృందాలతో కిటకిటలాడింది. శ్రావణ మాసంలో శనివారం రాత్రి అతిపెద్ద ముహూర్తం కావడంతో క్షేత్రంలో సుమారు 200కు పైగా వివాహాలు జరిగాయి. కొండపైన, కొండ దిగువనున్న కల్యాణ మండపాల్లో, తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపంలో, పాదుకా మండపం వద్ద ఉన్న స్వామివారి కల్యాణ మండపంలో, ఆలయ ప్రధాన రాజగోపుర మెట్ల మార్గంలోను, తూర్పురాజగోపుర ప్రాంతంలో వివాహాలు జోరుగా జరిగాయి. పెళ్లివారి వాహనాలతో ఘాట్‌రోడ్లు, ప్రధాన రహదారులన్నీ కిక్కిరిసాయి. ఆదివారం సైతం క్షేత్రంలో పెళ్లిళ్లు అధికంగా జరిగాయి. కొత్త జంటలు, వారి బంధువులు శ్రీవారిని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

ముగిసిన కార్యదర్శుల శిక్షణ


శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): రీఫ్రెషర్, స్వమిత్వ బ్యాచ్–1 శిక్షణా కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఆరు రోజులపాటు జెడ్పీ జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ కేవీఎస్ఆర్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, విజయవాడ ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ ఎం.మురళీ పాల్గొని మాట్లాడారు. కార్యదర్శులు శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో పాటిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు 208 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ జాయింట్ డైరెక్టర్ వై.దోసిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సాగర తీరం.. సరదా సమయం


బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌కు ఆదివారం సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సెలవు దినం కావడంతో కుటుంబ సమేతంగా తరలివచ్చి సముద్ర స్నానం చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఉదయం నుంచి ఎండతో పాటు ఉక్కపోతగా ఉండటంతో పెద్దలు, పిల్లలు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, వేలాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

పశుగ్రాసం కొరతను అధిగమిద్దాం ఇలా..

చింతలపూడి: వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ దశలో గ్రామీణ ప్రాంతాల్లో పాడిని నమ్ముకున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతులకు వ్యవసాయంతో పాటు పశు పోషణ ఆర్థికంగా తోడ్పాటునిస్తుంది. ఈ నేపథ్యంలో పశుపోషణలో పశుగ్రాసం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యాక పాడి రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అమూల్ డైరీ రంగ ప్రవేశంతో పాడి రైతులకు మేలు చేకూరనుంది. దీంతో మెట్ట ప్రాంతంలో పాడి పశువులను పెంచుకునే రైతులు పశుగ్రాసం పండించడంలో మెలకువలు తెలుసుకుంటే మేలు జరుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్ తెలియచేస్తున్నారు. పశు పోషణలో 70 శాతం ఖర్చు మేతకే అవుతున్నందున రైతులపై భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు.




మెట్టలో పశువుల కోసం మామిడి తోటలో చెట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో గడ్డి పండిస్తున్న రైతులు

వర్షాకాలంలో పశుగ్రాసం పండించుకుంటే వేసవిలో పశువుల పోషణకు ఇబ్బంది ఉండదని చెప్తున్నారు.

జనుము : ఇది కాయజాతి పశుగ్రాసం. అన్ని నేలల్లోనూ అన్ని కాలాల్లో కొద్దిపాటి నీటితో పండించుకోవచ్చు. ఎకరానికి 12 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లాలి. విత్తిన తరువాత 40, 50 రోజులకు కోతకు వస్తుంది. ఈ మేతను పూత దశలో కోసి ఎండు మేతగా వినియోగించుకుంటే ఉపయోగం ఉంటుంది.

పిల్లి పెసర : వరి సాగు చేసే అన్ని భూముల్లో అంతర పంటగా దీన్ని సాగు చేసుకోవచ్చు. సాధారణ భూములకు పచ్చి రొట్టగా వాడినచో భూమికి బలం చేకూరుతుంది. శీతాకాలంలో రబీ పంటగా ఈ పశుగ్రాసాన్ని సాగు చేసుకోవచ్చు. ఈ పశుగ్రాసం వేర్లలో నత్రజని బుడిపెలు ఉండటం వల్ల భూమి సారవంతమవుతుంది. వరి పంట కోయడానికి 3, 4 రోజుల ముందు అంటే భూమిలో తేమ ఉన్నప్పుడే ఎకరానికి 10 – 15 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లుకోవాలి. 50 రోజుల్లో కోతకు వచ్చే ఈ పశుగ్రాసం వల్ల ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పచ్చి మేత లభిస్తుంది.

ఇతర రకాలు : ఇక పశుగ్రాస మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్ రకం జె 1006 రకం, విజయ కాంపోజిట్ రకాలు 85 రోజులకు ఒకేసారి కోతకు వస్తాయి. పండ్ల తోటలు, పామాయిల్ తోటల్లో కూడా సాగు చేసుకోవచ్చు. రైతులకు అధిక పశుగ్రాస దిగుబడులను అందిస్తాయి. పప్పు జాతి రకాలైన అలసంద(బొబ్బర్లు) రష్యన్ జైంట్, బుందేల్ లోబియ 1, 2, ఇసి 4216 – 5287, కేబీసీ 2 మొదలైన రకాలు 55 నుంచి 60 రోజుల్లో ఒకే కోతలో నాణ్యమైన పశుగ్రాసాన్ని అందిస్తాయి.

భూసారం పెంపు : పంట కోత తరువాత, పండ్ల తోటల్లోని మొక్కల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పప్పు జాతి పశుగ్రాసాలు అలసంద, ఉలవ, పిల్లిపెసర, జనుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం వల్ల పశుగ్రాసం కొరతను అధిగమించడంతో పాటు భూమిలో నత్రజని స్థిరీకరించబడి భూసారం పెరిగే అవకాశాలు ఉంటాయి.


బి.నాగకుమార్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

క్లుప్తంగా

సామాన్యులపై ధరల భారం



బైక్ ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని సీపీఎం నాయకులు కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణలు విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు భారంగా మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఆదివారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం మండల కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, గొర్రెల వంశీ పాల్గొన్నారు.

ఐలూ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహాలు



తణుకులో ఉచితంగా న్యాయసలహాలు అందిస్తున్న న్యాయవాది మునిస్వామి

తణుకు: సివిల్ వివాదాలు పరిష్కరించే సమయంలో దస్తావేజులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించుకోవాలని న్యాయవాది కామన మునిస్వామి తెలిపారు. తణుకు పట్టణంలో ఆదివారం శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత లాయర్స్ యూనియన్ (ఐలూ) ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా కేంద్రం ద్వారా న్యాయ సలహాలు అందజేశారు. దస్తావేజులను పరిశీలించుకుని వారి ముందు దస్తావేజుల్లో విక్రయదారుడు రాసిన సంగతులను తెలుసుకోవాలన్నారు. ఈ కేంద్రంలో ఉచిత న్యాయ సలహాలు ప్రతి ఆదివారం న్యాయవాదుల సహకారంతో ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్ వెళ్లి గణపతికి ఫించన్ అందజేస్తున్న వలంటీర్ రాధాకృష్ణ

అత్తిలి: వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న తరుణంలో సేవ చేయడానికి దూరభారాలు అడ్డురావని నిరూపించాడు అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంకు చెందిన వలంటీర్ తాళాల రాధాకృష్ణ. గ్రామానికి చెందిన కూసంపూడి గణపతి అనారోగ్యానికి గురికాగా హైదరాబాద్‌లో ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి ప్రతీనెలా అందించే వృద్ధాప్య పింఛన్ సొమ్మును వలంటీర్ రాధాకృష్ణ హైదరాబాద్ వెళ్లి ఆసుపత్రిలో గణపతికి పింఛన్ అందజేశారు. రాధాకృష్ణ సేవాగుణాన్ని రోగి గణపతితో పాటు పలువురు అభినందించారు.

నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ప్రారంభం

అత్తిలి: మండల కేంద్రమైన అత్తిలిలోగల సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణ మండప ఆవరణలో డ్వాక్రాగ్రూపు సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని సోమవారం ఉదయం పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభిస్తారని మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అదేవిధంగా కొత్తగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేస్తారని తెలిపారు. పార్టీనాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన హేమ అచ్యుత దేవి 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది ప్రసాదం, రసీదును అందించారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తుందుర్రుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

భీమవరం అర్బన్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని సర్పంచ్ ఆరేటి సత్య వెంకట వీరాస్వామినాయుడు (పెద్దబ్బు)అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో ప్రయాణికుల సౌలభ్యం కోసం భీమవరం -తుందుర్రు బస్ సర్వీసును సర్పంచ్ ఆరేటి పెద్దబ్బు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా ముందు వరకు ఆర్టీసీ బస్ సర్వీసులు భీమవరం నుంచి తుందుర్రు నడిపేవారని తదానంతరం కరోనా కారణంగా నిలిపివేశారన్నారు. దీంతో తుందుర్రు, పెదగరువు, బేతపూడి, తాడేరు, వెంప, శ్రీరామపురం గ్రామాలతో పాటు నరసాపురం మండలంలో పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు జిల్లా కేంద్రం భీమవరం రావడానికి తీవ్ర ఇబ్బంధులు పడడంతో ఈ సమస్యను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే 4 బస్ సర్వీసులను వేయించారన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు ఘన నీరాజనాలు

- 18 మంది విగ్రహాల ఏర్పాటుతో తణుకువాసుల హర్షం
- తణుకులో స్వాతంత్య్ర సమరయోధులు, దేశ నాయకుల విగ్రహాలు
- స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తి కలిగించేందుకే అన్న మంత్రి కారుమూరి



తణుకులో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న మంత్రి కారుమూరి (ఫైల్)



తణుకు బ్యాంక్ కాలనీలో స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు

తణుకు అర్బన్: భారతదేశ స్వాతంత్య్రోద్యమ పోరాటంలో త్యాగధనులంతా వారి జీవితాలు త్యాగం చేసి అమరవీరులుగా ప్రజల హృదయాల్లో గూడు కట్టుకున్నారు. అటువంటి పోరాటయోధుల పుట్టిన గడ్డగా తణుకు చరిత్ర పుటల్లో నిలిచింది. ముఖ్యంగా జాతిపిత మహాత్మాగాంధీ అడుగిడిన నేల అయిన తణుకు ప్రాంతంలో విప్లవకారుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొంత కాలం విద్యాభ్యాసాన్ని చేసిన ప్రాంతంగా తణుకు చరిత్ర పుటల్లో ఖ్యాతి సాధించింది. అటువంటి మహనీయుల స్ఫూర్తితో స్వాతంత్య్రోద్యమ పోరాటంలో ఉద్యమాన్ని నడిపి జైలు జీవితం గడిపిన అమరవీరులు తణుకులో 30 మందికిపైగా ఉన్నారు. వారి వీరోచిత పోరాట ప్రతిమను తణుకుతో పాటు చుట్టుప్రక్కల గ్రామవాసులకు సైతం తెలియచెప్పాలనే తలంపుతో పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తణుకు బ్యాంక్ కాలనీలోని పార్కుకు స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంగా నామకరణం చేయించి యువత, నేటి బాలబాలికలకు స్ఫూర్తి కలిగే విధంగా స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయించారు.

18 విగ్రహాలు..

తణుకు బ్యాంక్ కాలనీలో ఉన్న పార్కులో స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంలో 18 మంది తణుకుకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేసి గత నెల 16వ తేదీన విగ్రహావిష్కరణలు చేశారు. అంతేకాకుండా రిటైర్డు ఆర్మీ అధికారులతో పాటు ఆ సమరయోధుల వారసులు, కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. దీంతో ఆగస్టు 15 వేడుకల్లో స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తిని కలిగించారు. తణుకు ప్రాంతంలో 30 మంది పైగా ఉన్నప్పటికీ సేకరించిన వివరాల ప్రకారం మునిసిపల్ నిధులు రూ. 10 లక్షలతో 18 మంది విగ్రహాలను తయారు చేయించి పార్కు ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న సమరయోధుల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి విచ్చేయడంతో సభలో హర్ష ధ్వానాలు వ్యక్తమయ్యాయి. విగ్రహాల ఏర్పాటులో కీలకభూమిక పోషించిన పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు బెల్లంకొండ బుచ్చిబాబును థీమ్ రూపకర్తగా మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు.

తణుకు దేశ నాయకుల విగ్రహాల చరిత్ర

తణుకు పట్టణంలో ప్రస్తుత మంత్రి కారుమూరి గతంలో దండిమార్చ్ ఉద్యమాన్ని ప్రజలు, చిన్నారులకు తెలిపే క్రమంలో ఆ నమూనాను తణుకులో ఏర్పాటు చేశారు. అనంతరం సొసైటీ రోడ్డులోని వైఎస్సార్ పార్కులో దేశ నాయకులు, ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు తృప్తినిచ్చాయి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కొలువులో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే సొసైటీ రోడ్డులోని వైఎస్సార్ పార్కులో దేశ నాయకుల విగ్రహాలన్నీ ఏర్పాటు చేశాను. ఇప్పుడు తాజాగా 18 మంది స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయడం చాలా సంతృప్తిగా ఉంది. నేటి బాలబాలికలకు స్వాతంత్రోద్యమ పోరాటంలో తణుకుకు చెందిన వీరులు కూడా ఉన్నారని తెలిపే ఉద్దేశ్యమే ఈ విగ్రహాల ఆవిష్కరణ. నాకు చాలా తృప్తినిచ్చింది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

నా తండ్రి జైలు జీవితాన్ని అనుభవించారు



భారత దేశ స్రాతంత్య్ర పోరాటంలో మా తండ్రి సంకు అప్పారావు బ్రిటీషు సైన్యంతో పోరాటం చేసి జైలు జీవితాన్ని అనుభవించారు. అయినప్పటికీ ఎటువంటి భయం లేకుండా తన పోరాటాన్ని కొనసాగించారు. అటువంటి మహనీయుడికి కుమార్తెగా పుట్టడం నా అదృష్టంగా భావిస్తున్నాను. స్వాతంత్రోద్యమ పోరాటానికి కృషి చేసిన పోరాటయోధుల విగ్రహాలు ఏ ప్రాంతంలోను పెట్టలేదు. తణుకులో మంత్రి కారుమూరి ప్రోత్సాహంతో విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పాటు కుమార్తెగా నన్ను పిలిచి సత్కరించినందుకు ధన్యవాదాలు.

– సంకు మనోరమ, రిటైర్డు ప్రిన్సిపాల్, తణుకు

మంత్రి కారుమూరి ఆదేశాలతో...



స్వాతంత్రోద్యమ వీరులను తణుకు ప్రాంతవాసులందరికీ తెలపాలనే తపనతో మంత్రి కారుమూరి స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాల ఏర్పాటుకు ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ పర్యవేక్షణలో రూ. 10 లక్షలు మునిసిపల్ నిధులతో 18 విగ్రహాల ఏర్పాటుతో పాటు పార్కును అభివృద్ధి చేస్తున్నాం.

– కొవ్వూరి ఈశ్వరరెడ్డి మునిసిపల్ డీఈఈ, తణుకు

తేతలి పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన తణుకు రూరల్ మండలం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి, అయన సతీమణి మున్సిపల్ పాఠశాల ప్రదానోపాధ్యాయిని రుద్రమదేవిలు తమ పాఠశాలలో ప్రతిభావంతులైన 13 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఆదివారం తేతలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి తండ్రి చెన్నారెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులు 13 మందికి అవసరమైన సైకిళ్లను గ్రామ సర్పంచ్ సరెళ్ల కాంతిప్రియ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గోపాల రెడ్డి, రుద్రమదేవి దంపతులు యూటీఎఫ్ భవన నిర్మాణానికి రూ. 24వేల విరాళాన్ని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీ జయకుమార్, జీ రవి, ఎస్ శివప్రసాదరాజులకు అందజేశారు. ఈసందర్భంగా గోపాలరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనలో బాగంగా ప్రతిభావంతులను ప్రోత్సాహించేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీ రంగయ్య, ఎం ఏడుకొండలు, పేరెంట్ కమిటీ అధ్యక్షురాలు ఏలూరి ఉమామహేశ్వరి, సుబ్రహ్మణ్యం, పుల్లారెడ్డి, నిర్మల్‌కుమార్, రామకృష్ణ, బుచ్చియ్య, ప్రకాశరావు, శ్రీనివాసు, దుర్గారావు పాల్గొన్నారు.

సామాజిక సేవలో తరించాలి



నారాయణరెడ్డిని సత్కరిస్తున్న ట్రినిటీ చర్చ్ ప్రతినిధులు

ఉండి: ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో తరించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకుడు ద్వారంపూడి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో జరిగిన ప్రార్థనల్లో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పేరిష్ పాస్టర్ రెవ. వి. నెహ్రూ, సంఘ సీఆర్ పి.కరుణాకర్ ప్రత్యేక ప్రార్థనలు చేయగా, ఆయనను సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చర్చ్ సంఘ పెద్దలు ఆలమూరి శ్యాంబాబు ,గుమ్మడి అమృతరావు, చుక్కా శేఖర్, ముత్యం కుమార్, పీసీసీ సికిలే వెంకట్, చిగురుపాటి కర్నేలు, స్త్రీల సమాజ అధ్యక్షురాలు పొట్ల విమల, సండే స్కూల్ టీచర్ ముత్యం శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలి

భీమవరం అర్బన్: మణిపూర్ రాష్ట్రంలో హింసాకాండ కొనసాగుతుందని కేంద్రం ప్రభుత్వం ప్రశాంత వాతావరణం తీసుకురావాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో ఆదివారం దళిత ఐక్య వేదిక మండల శాఖ, అంబేద్కర్ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులకు రక్షణ కల్పించాలన్నారు. ఇటీవల జరిగిన దళిత క్రైస్తవులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని దళిత క్రైస్తవులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అంబటి ఆనంద్‌కుమార్, ఎ సంతోష్ బాబు, వాసా గణేష్, జె.ప్రసన్నకుమార్,ఎ రాజు, బట్టు సతీష్, వి పాలేశ్వరరావు, ఎ.బాలు, కె.కళ్యాణ్ పాల్గొన్నారు.

85 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు

తణుకు టౌన్ : పట్టణంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా అందించే సేవలలో భాగంగా అఖిల భారత స్థాయిలో దివ్యాంగుల కోసం పని చేస్తున్న సక్షమ్ అభ్యర్థన మేరకు 85 మందికి దివ్యాంగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్రలు సంచార వైద్యశాల ద్వారా 85 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాదికారి ఆర్జి బాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం ధర్నా

సాక్షి, భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం తహశీల్దార్, ఆర్‌డిఓ కిర్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం నిత్యావసరాల అదుపునకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే ధర్నాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బలరాం కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండి: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగితో అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న పాలా రాఘవ ఉణుదుర్రు గ్రామానికి కూడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం ఉణుదుర్రు గ్రామా నికి చెందిన గొల్ల పుష్పలత అనే మహిళ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. పాస్‌పోర్టు ఎంక్వయిరీలో భాగంగా ఈనెల 2వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో దరఖాస్తుదారు తమ్ముడు తణుకుల సామేలు అనే వ్యక్తికి మహిళా పోలీస్ ఫోన్ చేసి వివరాలు అడిగారు. వివరాలు సేకరిస్తున్న క్రమంలో ఆమెతో సామేలు అసభ్యకరంగా మాట్లాడిన కారణంగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

7న కృష్ణాష్టమి వేడుకలు



ఇస్కాన్ ప్రభు మురళీధర్

తాడేపల్లిగూడెం అర్బన్ : ఈనెల 7వతేదీన ఇస్కాన్ తాడేపల్లిగూడెం శాఖలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని స్థానిక ఇస్కాన్ టెంపుల్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను ప్రభు మురళీధర్ ఆదివారం వెల్లడించారు. 7వతేదీ గురువారం ఉదయం 4.40 గంటలకు మహా మంగళ హారతి కార్యక్రమంతో ప్రారంభమై 8.30కు గురుపూజ, 9 గంటలకు శ్రీమద్ భాగవవతం ప్రవచనము, 10 గంటల నుంచి నిరంతర దర్శనం, హరినామ సంకీర్తన, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు రాత్రి 11 గంటల వరకు శ్రీకృష్ణ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం చిన్నారులు, యువతతో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రత్యేక పూజల్లో భాగంగా రాధాకృష్ణల అభి షేకం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఈ అభిషేకం ప్రపంచంలో ఉన్న ఇస్కాన్ ఆలయాల్లోను నిర్వహిస్తున్నారని చెప్పారు. తాడేపల్లిగూడెం పట్టణ నివా సులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని మురళీధర్ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల్లో మానవీయ విలువలు ప్రతిబింబించాలి



స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ యశ్వంత్ పాటిల్

సాక్షి, భీమవరం: విద్యార్థుల్లో మానవీయ విలువలు ప్రతిబింబించే విధంగా విద్యాబోధన చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు కృషి చేయాలని మహారాష్ట్రకు చెందిన ప్రొఫెసర్ యశ్వంత్ పాటిల్ చెప్పారు. నూతన విద్యా విధానం 2020లో భాగంగా ఏఐసీటీఈ యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్‌పై భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. కళాశాల ఇంజినీరింగ్ కెమిస్ట్రీ హెడ్ పి.భవాని, దివాకర్ల కోఆర్డినేటర్స్‌గా వ్యవహరించిన శిక్షణా కార్యక్రమంలో యశ్వంత్‌పాటిల్ మాట్లాడుతూ ప్రధానంగా విద్యారంగంలో ప్రతి విద్యార్థి తన టీచర్‌ను రోల్‌మోడల్‌గా తీసుకొని తన జీవన విధానాన్ని రూపొందించుకునే అవకాశాలు కల్పించాలన్నారు. ప్రస్తుత విద్యావిధానం నైపుణ్య ఆధారిత విధానంగా మారిందని అందువలన విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పాటు సమాజానికి సేవ చేయాలనే విశాల ధృక్పదాన్ని పెంపొందించుకునేలా చేయాలని యశ్వంత్‌పాటిల్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు, ప్రొఫెసర్ శ్రీజ మధు, ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఆర్అండ్‌డి డీన్ పీఏ రామకృష్ణంరాజు, పి భవాని, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీఎన్నార్ డిగ్రీ పరీక్షా ఫలితాల విడుదల



భీమవరం డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల డిగ్రీ పరీక్షా ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫలితాల్లో బీఏ 78 శాతం, బీఎస్సీ 64 శాతం , బీకాం 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించారని చెప్పారు. రీవ్యాల్యుయేషన్, జవాబు పత్రాల పరిశీలనకు విద్యార్థులకు సెప్టెంబర్ 4వ తేది నుంచి 8వ తారీకు వరకూ అవకాశం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.శ్రీనివాసరాజు, ఏఓ పి.రామకృష్ణంరాజు, పి.శిరీష్ కుమార్ పాల్గొన్నారు.

నన్నయ క్యాంపస్‌కు పూర్వ వైభవం తేవాలి

- క్యాంపస్ గాడిలో పడాలి
- ప్రత్యేక దృష్టి పెట్టాలి



నన్నయ యూనివర్సిటి క్యాంపస్



మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసిన నన్నయ క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్

తాడేపల్లిగూడెం: విద్యార్థుల భవిష్యత్ కోసం దూరదృష్టితో ఆలోచించి కోట్లు పలికే విలువైన స్థలాన్ని ఉన్నత విద్యాసంస్థ ఏర్పాటు చేయడానికి ఏకంగా వంద ఎకరాలు కేటాయించారు. గోదావరి యూనివర్సిటీ స్థాయిలో అభివృద్ధి చేయాలనే ఉన్నత సంకల్పంతో అభివృద్ధిని కాంక్షించే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆంధ్రాయూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. విలువైన విమానాశ్రయ భూములను కేటాయించి పనులు చేశారు. కొంత మేర భవన నిర్మాణాలు చేపట్టారు. అనుకున్న అభివృద్ధి చేయడంలో వర్సిటీ అధికారుల విజన్ కొరవడింది. దీంతో రెవిన్యూ అధికారులు ఇతర అవసరాల కోసం ఇచ్చిన భూమిలో 82 ఎకరాలను వెనక్కి తీసుకున్నారు. అభివృద్ధి కూడా తగ్గిన భూమి మాదిరిగానే తగ్గిపోయింది. తొలుత ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌గా, అనంతరం నన్నయ్య ప్రాంగణంగా రూపాంతరం చెందిన ఈ క్యాంపస్ వివాదాలకు ఇటీవలి కాలంలో కేరాఫ్ అడ్రస్‌గా మారింది. క్యాంపస్‌పై ప్రత్యేక దృష్టి సారించి గాడిలో పెట్టాల్సి ఉంది. దీనిపై ప్రత్యేక కథనం.

ఆదినుంచి వివాదాలు

ఏయు క్యాంపస్‌గా ఉండగా ప్రత్యేకాధికారులుగా వచ్చిన వ్యక్తుల వ్యక్తిగత వ్యవహారశైలి క్యాంపస్ అభివృద్ధికి శాపంగా మారింది. పరిపాలనా పరమైన నిర్ణయాలతో ఏయు క్యాంపస్ కాస్తా, నన్నయ్య ప్రాంగణంగా మారింది. అభివృద్ధి లేకపోయినా, వివాదాలు లేకుండా చదువులు సాగాయి. విద్యార్థులను రాత్రిపూట ఫోన్లు చేసి వేధించే బాధ్యులు, పరీక్షల సమయంలో నిరీక్షించి మరీ వేధించే ప్రబుద్ధులు ఈ క్యాంపస్‌లో తిష్టవేసి, సరస్వతీ నిలయానికి మచ్చతెచ్చేలా వ్యవహరించిన సందర్భాలు వివాదాస్పదమయ్యాయి. కమిటీలు వేసి చేతులు దులుపుకుని, నిబంధనావళి ముసుగులో చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. కులం పేరిట లాబీయింగ్‌లతో కొందరు దళారులు రంగ ప్రవేశం చేసి, కమిటీలను, అధికారులను ప్రభావితం చేసే పనులు జరిగాయి. విమర్శలు ఎదుర్కొంటున్న వారిని ఇంకా క్యాంపస్‌లో కొనసాగిస్తున్నారు. దీంతో సంస్థపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి గాడిలో పెట్టాల్సి ఉంది.

ఎట్టకేలకు ఫుల్‌టైం ప్రిన్సిపాల్

నన్నయ్య ప్రాంగణానికి ఎట్టకేలకు ఇటీవల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న వ్యక్తిని తప్పించి గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన అశోక్ అనే వ్యక్తిని నియమించారు. ఆయన క్యాంపస్‌ను గాడిలో పెట్టే పనికి శ్రీకారం చుట్టారు. మరకలు వేసుకున్న కొందరిని తప్పిస్తే కాని, ఈ క్యాంపస్ ముందుకు అవరోధాలు లేకుండా సాగే వాతావరణం లేదు. విజన్‌తో కొత్త ప్రిన్సిపాల్ ఉన్న, సంపూర్ణ సహకారం అందరి నుంచే ఉంటేనే ఇది సాకారం అయ్యే అవకాశం ఉంది.

చేరికలపై ప్రభావం..

ప్రాంగణం ప్రతిష్ట మసకబారడంతో ఈ ప్రభావం నేరుగా చేరికలపై పడింది.2021–22 విద్యాసంవత్సరంలో సగానికి పైగా సీట్లు భర్తీ కాలేదు. ఎంబీఏలో 44 సీట్లకు గాను 25 మంది, ఎంఎస్సీ ఫిజిక్స్‌లో 33 సీట్లకు గాను 11 మంది, బి.ఫార్మసీలో 66 సీట్లకు గాను 32 మంది చేరారు.ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో స్టీలో 33 సీట్లకు గాను 33, అనలైటికల్ కెమిస్ట్రీలో 17 సీట్లకు గాను 17 మంది చేరారు. 2022–23లో ఈ ప్రభావం తీవ్రంగా మారింది. ఎంబీఏలో 44 సీట్లకు గాను 25 మంది, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 33 సీట్లకు గాను 24 మంది, ఎంఎస్సీ అనలైటికల్ కెమిస్ట్రీలో 17 సీట్లకు గాను 16 మంది, ఎంఎస్సీ ఫిజిక్స్‌లో 33 సీట్లకు గాను 10 మంది, బి.ఫార్మసీలో 66 సీట్లకు గాను 52 మంది చేరారు.

మంత్రిని కలిసిన ప్రిన్సిపాల్

ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణను ఆదివారం క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపస్ అభివృద్ధికి ప్రయత్నం చేస్తానని, గాడిలో పెడతానని మంత్రికి తెలియచేసినట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. మంత్రి సహకారంతో కొత్త కోర్సులు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు.

జన్మరాహిత్యం కోసం ధ్యానం చేయాలి

అత్తిలి: మాయ అనే మత్తు నుంచి బయటపడి శ్రద్ధను పెంచుకుంటే ధ్యానులు కాగలరని భీమవరంకు చెందిన పిరమిడ్ మాస్టర్ పార్వతి అన్నారు. అత్తిలి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్మరాహిత్యం కోసం ధ్యానం చేయాలని, సమయాన్ని అనవసర విషయాల కోసం వృధా చేయవద్దని కోరారు. అహింస, సత్యవ్రతం, బ్రహ్మచర్యం పాటించడం ద్వారా మనిషి ఉత్తమ ధ్యానుడుకాగలడన్నారు. కర్మ సిద్ధాంతం ప్రకారం పుట్టిన తర్వాత కర్మలను అనుభవించడం ద్వారా సూన్యస్థితికి చేరుకుని మోక్షాన్ని పొందవచ్చన్నారు. అత్తిలి పిరమిడ్ మాస్టర్ పంజా ప్రసాద్, దాసం వెంకట ప్రసాద్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.